

# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## మధుర గాయకుని విషాద గాథ..!

### (విజయచిత్ర – 1980, జనవరి సంచిక నుంచి )



మధురగాయకుని విషాద గాథ...

సినిమా సంగీతం పట్ల విశేషమైన ఆకర్షణ ఏర్పరచి, తన గాన మాధుర్యంతో అశేష ప్రజావాహిని ఆదరణను చూరగొన్న కె. ఎల్. సైగల్ సినిమా సంగీత ప్రపంచంలో అమరమూర్తిగా సుప్రసిద్ధుడు. సైగల్ విశిష్టతను వివరించే ఈ వ్యాసాన్ని ఆయన వర్ధంతి (18-1-80) సందర్భంగా యిక్కడ ప్రచురిస్తున్నాము.

సినిమా సంగీతం పట్ల విశేషమైన ఆకర్షణ ఏర్పరచి, తన గాన మాధుర్యంతో అశేష ప్రజావాహిని ఆదరణను చూరగొన్న కె.ఎల్.సైగల్ సినిమా సంగీత ప్రపంచంలో అమరమూర్తిగా సుప్రసిద్ధుడు. సైగల్ విశిష్టతను వివరించే ఈ వ్యాసాన్ని ఆయన వర్ధంతి (18–1–80)సందర్భంగా యిక్కడ ప్రచురిస్తున్నాము.

★★★★★

అతను చదువుకున్నది పూర్తిగా వానాకాలం చదువు. అల్లరి చిల్లరిగా తిరుగుతూ వుండేవాడు. పచ్చని పొలాల్లోనూ నదీ తీరాల్లోనూ ఎక్కువ కాలం గడుపుతూ వుండేవాడు. ఐనా అతి చిన్న వయసులోనే కుటుంబాన్ని పోషించే బాధ్యత స్వీకరించవలసి వచ్చింది. ఉద్యోగం కోసం జలంధర్ నుంఛి కలకత్తా చేరుకున్నాడు. చాలా చోట్ల తిరిగాడు. ఉద్యోగం కోసం అతను ఎక్కి దిగని గడప లేదు. ఆఖరికి టైప్ రైటర్ అమ్మే ఉద్యోగం దొరికింది. అందులో అతను రాణించలేకపోయాడు. ఆ తర్వాత బట్టలమ్మే ఉద్యోగం చేపట్టాడు. అందులోనూ అంతే !

అయితే అదృష్టం అతనిని వెతుక్కుంటూ వచ్చింది. ఒక సంగీత సభలో అతను అనుకోకుండా పాడాడు. “ఇంతవరకూ ఈ గాయకుడు ఎక్కడ దాక్కున్నాడా?” అని అందరూ ఆశ్చర్యపోయారు. ఆ రోజునే సైగల్ మధుర గాయకుడిగా అవతరించాడు !

సంగీత ప్రియుల జ్ఞాపకాలలో నిరంతరం జీవించే కుందన్ లాల్ సైగల్ జమ్ములో ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు (1901)! అయితే అతను పెరిగింది మటుకు జలంధర్ లో.

కలకత్తా లోని ప్రముఖ స్టూడియో 'న్యూ థియేటర్స్' కు అధిపతి బి.యన్.సర్కార్. స్టూడియో ఇన్–చార్జి జె.హెచ్ హఫీజ్ జీ. సర్కార్ కి సైగల్ ని పరిచయం చేయడంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమకి హఫీజ్ జీ సంగీత భిక్ష పెట్టాడని చెప్పాలి. అదే సమయంలో ప్రముఖ స్వరకర్త గాయకుడు పంకజ్ మల్లిక్ సైగల్ ప్రతిభని గుర్తించాడు. ఆయన ప్రోత్సాహంతో కలకత్తా రేడియో స్టేషన్ నుంచి సైగల్ గానం మొదటిసారి ప్రసారమయింది. సైగల్ పేరు ఒక్కసారి నలుగురినోట వినిపించింది. !

అంతవరకూ బెంగాలీ భాషలోనే చిత్రాలు నిర్మిస్తోన్న న్యూ థియేటర్స్ హిందీలోనూ చిత్రాలు నిర్మించడం ఆరంభించారు. న్యూ థియేటర్స్ దృష్టిలో పడిన సైగల్ 'సెహగల్ కాశ్మీరి' అన్న పేరుతో 'మొహబ్బత్ కే ఆన్ సూ' చిత్రంలో నటించాడు. 1932 లో విడుదలయిన ఆ చిత్రం అపజయం పొందింది. సైగల్ ఆ తర్వాత నటించిన రెండు చిత్రాలు 'జిందాలాష్'

'సుబహ్ కా సితారా' కూడా విజయవంతం కాలేకపోయాయి. సైగల్ ఇక చిత్రాలలో నటించడని. పరిశ్రమలో స్థానం లభించదని ఎందరో వ్యాఖ్యానించారు. అయితే 'చండీదాసు' విడుదలానంతరం నటుడిగా సైగల్ ప్రతిభ మీద న్యూ థియేటర్స్ సంస్థలోని ప్రముఖులకు నమ్మకం పెరిగింది.

నటుడిగానే కాక గాయకుడిగా కూడా సైగల్ 'చండీదాసు' చిత్రంతో వెలుగులోకి వచ్చాడు. వెనువెంటనే వచ్చిన 'దేవదాసు'తో సైగల్ పేరు దేశమంతటా మారు మ్రోగింది.

'దేవదాసు' లో సైగల్ పాడిన 'బాలమ్ ఆయే...' 'దుఃఖ్ కే దిన్' పాటలను ఈ నాటికీ ఎవరూ మరచిపోలేదు. హిందీ 'దేవదాసు' చిత్రంలో దేవదాసుగా నటించిన సైగల్ బెంగాలీ 'దేవదాసు' చిత్రంలో చిన్న వేషం మటుకే వేశాడు. దేవదాసుగా బారువా నటించాడు. బెంగాలీలో పాటలు మాత్రం సైగల్ పాడాడు.

'దేవదాసు' తర్వాత సైగల్ ఎన్నో చిత్రాలలో నటించాడు. ఎన్నో పాటలు పాడాడు. 'ఏక్ బంగ్లా బనే నయారా' (ప్రెసిడెంట్), 'బాబుల్ మోరా' (స్ట్రీట్ సింగర్), 'కిస్నే యేసబ్ ఖేల్ రచాయా' (ధర్తీమాత), 'సోజా రాజకుమారీ సోజా' (జిందగీ), 'దో నైనా మత్ వారే', (మేరీ బహన్), 'దియా జలావ్' (తాన్ సేన్), 'జబ్ దిల్ హీ టూట్ గయా'... హమ్ జీకే క్యా కరేంగే' (షాజహాన్) వంటి పాటలు ఒక్క సైగలే పాడగలడనిపించే మధుర గీతాలు. ఆ చిత్రాలు విజయవంతం కావడానికి సైగల్ పాడిన ఈ పాటలే ప్రధానమైన కారణం అని చెప్పుకోవచ్చును.

సైగల్ పాడిన పాటలు ప్రైవేట్ రికార్డులుగా ఎన్నో వెలువడ్డాయి. వాటిలో మీర్జా గాలిబ్ 'నుక్తా చీన్ హై' ఘజల్ సైగల్ కి ఎంతో కీర్తి తెచ్చింది.

సైగల్ పాడిన పాటల వివరాలు చెప్పాలంటే ఒక గ్రంథమే వ్రాయవలసి వస్తుంది. అయితే ఇంత గొప్ప గాయకుడు మద్యపానానికి బానిసై పోయాడు. తల్లి మరణంతో సైగల్ ఎంతో క్రుంగిపోయాడు. చివరి రోజుల్లో సైగల్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడ్డాడు. జీవితంలో క్రమమైన పద్ధతులు ఏవీ సైగల్ పాటించలేదు. షూటింగ్ కి వేళకి చేరుకోలేకపోయే వాడు. అదీ అతి కష్టం మీద వచ్చేవాడు.

తన అవసరాలు గమనించకుండా సైగల్ శక్తికి మించి దానధర్మాలు చేసేవాడు. ఆయన ఎప్పుడూ పేరుకోసం ప్రాకులాడలేదు. స్టూడియోలో పని చేసే లైట్ బాయ్స్ కు, తక్కిన చిన్న కార్మికులకు సైగల్ అడిగింది లేదనకుండా ఇచ్చేవాడు. మిగిలిన వారికన్నా తాను గొప్ప అనే అహం సైగల్ లో ఏమాత్రమూ వుండేది కాదు !

తెర మీద సైగల్ దేవదాసుగా నటించాడు. దేవదాసు త్రాగి నాశనమయ్యాడు. కానీ, నిజజీవితంలో సైగల్ దేవదాసును మరిపించాడు.

ఆఖరి రోజుల్లో రికార్డింగ్ సమయంలో సైగల్ ప్రతి 'టేక్' ముందు కొంత విస్కీ పుచ్చుకుని పాట ప్రారంభించేవాడు. 'షాజహాన్' చిత్రంలో సైగల్ పాడిన పాటలు గొప్ప హిట్ అయ్యాయి. సైగల్ ఆ చిత్రంలో పాటలు పాడినప్పుడు తాగకుండా ఉండమని కోరాడు ఆ చిత్ర సంగీత దర్శకుడు నౌషాద్. ఆయన మాట ప్రకారం త్రాగకుండానే ఆ పాటలు అద్భుతంగా పాడాడు సైగల్. భవిష్యత్తులోనూ ఇదే పంథాను అనుసరించమని నౌషాద్ ప్రేమతో సైగల్ కు సలహా చెప్పాడు.

ఆయన మాటల్లోని సత్యాన్ని గ్రహించినా "ఇక లాభం లేదు... నౌషాద్ జీ.... నేను త్రాగుడు మానలేను. మనం ఇదివరకే కలుసుకుని వుండి ఉంటే నేను ఇంకొక 'కుందన్' ను అయ్యే వాడిని!" అన్నాడు సైగల్ నౌషాద్ తో. ('కుందన్' అంటే మేలిమి బంగారం అని అర్థం!)

సైగల్ క్రమక్రమంగా క్షీణించడం ప్రారంభించాడు. భయంకరమైన వ్యాధి అతనిని ఆవరించింది. ఐనా ఆఖరి రోజు వరకూ కుటుంబ సభ్యుల అవసరాలు అతను గమనిస్తూనే వచ్చాడు.

1947 జనవరి 18 న సైగల్ జలంధర్ లో మరణించాడు. అతని మరణ వార్తను ఆలిండియా రేడియో ప్రసారం చేసింది. సంగీత ప్రియులు ఆ రోజున దుఃఖ సాగరంలో మునిగిపోయారు !

సైగల్ 'జీవితగాథ'ను 'అమర్ సైగల్' పేరిట చలన చిత్రంగా బి.యన్.సర్కార్ నిర్మించారు. సైగల్ నటించిన చిత్రాలలోని సన్నివేశాలు, అతను పాడిన పాటలు 'అమర్ సైగల్' చిత్రంలో వున్నా. ఆ చిత్రం సైగల్ కి పూర్తి న్యాయం మటుకు కలిగించలేదు.

సైగల్ మరణించాడు. అయితే సైగల్ స్వరానికి మరణం లేదు. అది వినిపిస్తూనే వుంటుంది. ప్రజల హృదయాల్లో ఆ సజీవ స్వరం కలకాలం జీవిస్తూనే వుంటుంది.

★★★

COMMENTS